# పిచ్చివాడు★

—వాసా భక్తుల

ఆరేళ్ళకిందట జరిగిన సంగతి-

ఒక పిచ్చివాడు మాగ్రామంవచ్చి అప్పటికి సుమారు మూడుమాసము లవుతుంది. అతడు పొడగరి; వేళకు తిండిలేనందువల్ల అతని శరీరంలోని యెముకలు కనిపించేవి ఒకొకరోజున నడిరోడ్డుమీద పండుకొనేవాడు. వొకొకసారి అరుగుమీద పండుకొనేవాడు- వొకొక్కరోజున అతనెక్కడ పండుకొనేవాడో యెవ్వరికీ తెలీదు- అతనికి స్త్రీ లెవరయినా కనుపిస్తే తన వ్రేలుతో చూపుతూ "స్త్రీలను నమ్మకండి''అని ఆదగ్గరలోనున్న వారికందరికీ వినిపించేలా గట్టిగా కేకవేసి పారిపోయేవాడు- వాడునిజంగా పిచ్చివాడు కాడు. పిచ్చివాడిలా నటిస్తున్నాడు దొంగవెధవ అనీ ఇంకా వారినోటికివచ్చిన తిట్లు యెన్నో తిట్టేవారు కొందరు. వాడునిజంగా పిచ్చివాడేఅని యెవరయినా అంటే "ఏపిచ్చివాడయినా స్త్రీలను నమ్మకండి అని నీతులుచెపుతాడా' పండితుడు లాగ" అని చొప్పదంటుప్రశ్నలు వేసేవారు- అన్నం వెయ్యడానికి స్త్రీలెవరయినా పిలుస్తే "స్త్రీలను నమ్మకండి" అని కేకవేసి పారిపోయేవాడు. అతవిని పురుషులెవరయినా పిలిచి అన్నంవేస్తే సంతోషంతో తీసికొని వెళ్లిపోతూ "బాబూ స్త్రీలను నమ్మకండి''అని యెంతో వినయంతో చెప్పేవాడు- పిచ్చివాడు దారిపోతుంటే మేము ప్రజ్ఞావంతుల మన్నట్లుగా కొందరుపిల్లలు అతనిపై రాళ్లు రువ్వేవారు. "కొట్టండి, ఇంకాకొట్టండి" అనేవాడు వొకొకసారి వెకిలిగా నవ్వేవాడు- "స్త్రీలను నమ్మకండి'' అని ఏడ్చేవాడు- వొకరోజున పాలెం జమిందారుగారు వచ్చి ఆపిచ్చివాడ్ని తీసుకువెళ్లారు. పాలెం జమిందారుగారు వచ్చి అతనిని తీసుకువెళ్ళిన కారణం మొదట్లో మాకెవ్వరికీ తెలీదు. వారంరోజులు జరిగినతరువాత అతనిచరిత్ర తెలిసింది-

ఆపిచ్చివాడు పాలెం జమిందారయిన కోటయ్యగారి కుమారుడు సుదర్శనం. అతడు రెండేండ్లక్రితం మద్రాసు మెడికల్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుకొను చుండగా ఆకాలేజీలో విద్యార్థినియగు నీరజను ప్రేమించాడు- ప్రేయసిని హృదయేశ్వరిగ చేసికొన నిశ్చయించుకున్నాడు. అంతేకాకుండా అతననుభవించే సుఖంలో సగపాలు ఆమెకిద్దామనుకున్నాడు. ఆ సంవత్సరమంతా ఆమెతో సంతోషంగా గడిపాడు ఆమె బీద విద్యార్థినియని తెలిసికొని ధనసహాయం చాలా చేశాడు లెక్కలేనన్ని చీరలు కొనిపెట్టాడు- ఆ సంవత్సరములో పరీక్షయం దుత్తీర్ణుడయ్యాడు వేసంగి సెలవులమీద నీరజనువిడచి పాలెం వెళ్ళలేక మద్రాసులోనే ఉండి ఆ సెలవులను హాయిగా గడిపాడు- మెడికల్ కాలేజీ తెరిచారు. మూడు మాసములు గడిచింది. పుష్టిగావుండే అతనిశరీరాన్ని మలేరియా జ్వరం ఆవరించింది. నీరజ అతనికి సపర్యలు చేస్తూనేఉంది. జ్వరం తగ్గడంతోనే మరలా మద్రాసు వస్తానని నీరజతో చెప్పి సుదర్శనం తనస్వగ్రామం చేరాడు. సుద

ర్శనం జ్వరంతో బాధపడుతున్నప్పటికీ "నీరజా! నీరజా!" అని కలవరించేవాడు, "జ్వరం ఎప్పుడు తగ్గుతుంది? నేనెప్పుడు మద్రాసు వెళ్ళవచ్చు?" అని ప్రతీరోజు అడిగేవాడు డాక్టర్ని. నెలరోజులకు జ్వరం పూర్తిగాతగ్గింది కానీ జ్వరం తగ్గిన నెల రోజులకుగాని సుదర్శనం తేరుకోలేకపోయాడు. మరల మద్రాసు చేరగానే ప్రాణేశ్వరిగా చేసికొనదలచిన నీరజ ఇంటికే వెళ్ళాడు. సుదర్శనం వెళ్లేటప్పటికి నీరజ ఇంకొక విద్యార్థిఒడిలో కూర్చుని అతని నోటికి తమలపాకులు అందిస్తోంది. వచ్చిన కోపాన్ని ఆపుకోలేక సుదర్శనం ఆమెను లెంపకాయ కొట్టాడు. నీరజ వెంటనే ఆ విద్యార్థి ఒడిలోనుంచి లేచినిలబడింది. "దుర్మార్గురాలా! నీవు బీదదానివని నేను సహాయంచేశాను, నిన్ను ప్రేమించాను, చివరకు నిన్ను వివాహంగూడా చేసుకొందామనుకొన్నాను. నాలాంటివాళ్ళ నెంతమందిని ఇంకా మోసంచేయ దలచావు?" అని ఎన్నో తిట్లుతిట్టాడు సుదర్శనం

"నేను నిన్ను ప్రేమించలేదు. నీ ఐశ్వర్యాన్ని ప్రేమించాను. నీవు నాఇంట్లోంచి వెళ్లు! ... నీకన్నా గొప్పధనికుడు దొరికాడు నాకు-" అని సగర్వంగా పలికింది నీరజ. నీరజ ఇంట్లో ఒక్క-సెకండుకూడా ఉండలేదు. సుదర్శనం చదువు మానేసి పాలెం వచ్చేశాడు. అప్పటినుంచీ అతనికి పిచ్చెత్తింది. జమీందారుగారు అనేకమంది డాక్టర్లను పిలిపించారు సుదర్శనంపిచ్చి బాగు చేయటానికి. కానీ లాభంలేకపోయింది- ఒక నాటిరాత్రి జమీందారుగారింట్లో అందరూ నిద్రించాక పారిపోయి మా గ్రామం వచ్చేశాడు.

# హెచ్చరిక

రచయిత పోతుకూచి సాంబశివరావు బి ఏ

ఆంధ్రజాతి అణగిపోయెనె
ఆంధ్రజ్యోతి ఆరిపోయెనె?
నీరసంబగ జాతియంతయు
నిద్రపోయెనా?
బాలచంద్రుని లలితశౌర్యము
బ్రహ్మనాయని సింహగర్జన
తెన్గుజాతి వీరతత్వం
తీవ్రశక్తులోయి!

అమరావతి గుహలలోన
హత్తుకొన్న ఆంధ్రశిల్పం
శిల్పకళకే తీరుదిద్దే
మెరుపుతీగోయి!

ఆంధ్ర ఖడ్గము నిశితనాట్యం
ఆంధ్ర గంటము జీవనృత్యం
ఆంధ్ర శిల్పము చాకచక్యం
బయట నున్నోయి!

ఏండ్లు ఎన్నో గడిచెకాని
ఆశపడిన ఆంధ్రరాష్ట్రం
నేటివరకు కలయె కాని
నిజముకాదయ్యే
ఎచటకేగిన యీ సడింపె
ఎచట జూచిన కుట్రలేవోయి!
జాతి బ్రతుకే హీనమగుచో
చావుతప్పదుగా!
రాష్ట్రస్థితికి నడుముకట్టి
జాతివృద్ధికి బలముకూర్చి
ఆంధ్రవీరుడ కార్యకరణకు
కదిలిరావోయి!

ఆంధ్రమాత పూర్ణతేజం
అవనిజూపి ఆంధ్రవీరుడ
దీరుజాతి నిందుభావిని
నిశ్చయింప పోయి!

